క్లుప్తంగా

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని భవిత కేంద్రాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఫిజియో థెరపిస్టులు(నాలుగు పోస్టులు)గా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ సీహెచ్ విజయజ్యోతి కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీటీ/ఎంపీటీ కోర్సులు చదివిన వారు ఈ నెల 9వ తేదీలోపు rvmssakurnoolblogspot. in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. తర్వాత వాటిని పూరించి ఈనెల 12వ తేది సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 4వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ..కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని, వారంతపుసెలవులు మంజూరు చేయాలని ప్రధాన డిమాండ్లతో ధర్నాకు దిగుతున్నట్లు చెప్పారు.

నూతన సూపరింటెండెంట్ నియామకం

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నూతన సూపరింటెండెంట్ నియమతులయ్యారు. సత్యసాయి జిల్లా హిందూపురం డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నరసింహ రాజుకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పి ంచి కర్నూలులో పోస్టింగ్ ఇచ్చారు.

30న రన్ ఫర్ జీసస్

కర్నూలు (టౌన్) : ఈనెల 30 న నగరంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హోసన్న మినిస్ట్రీస్ సంఘ కాపరి బ్రదర్ ఫ్రెడీపాల్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక హోసన్న మందిరంలో రన్ ఫర్ జీసస్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చైర్మన్ సజీవరాజు, కన్వీనర్ దాసరి సుధీర్, ఆనందరావు, సీఎస్‌ఐ కమిటీ మెంబర్లు జాన్ చంద్ర కార్యదర్శి జయాకర్ పాల్గొన్నారు.

ఏపీకి బీజేపీ మోసం

కర్నూలు(సెంట్రల్): రాజధాని, పోలవరం, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీకి బీజేపీ మోసం చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.శనివారం కర్నూలులోని దేవీ ఫంక్షన్ హాలులో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు బి.గిడ్డయ్య, రంగనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు అత్యంత శత్రువైన పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీ మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుడ్ షెపర్డ్‌లో సైన్స్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు సిటీ: స్థానిక విఠల్‌నగర్‌లోని గుడ్ షెపర్డ్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, 26 వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కాలానుగుణంగా వచ్చే మార్పులను దృష్టిలో పెట్టుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఎక్స్‌పోలో పిల్లలు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఇందులో డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఆ స్కూల్ కరస్పాండెంట్ మిన్నల్ల, ప్రిన్సిపాల్ మెహరున్నీసా పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే పేదలకు లబ్ధి

- పెత్తందారులకు ఊడిగం చేసే పార్టీ తెలుగుదేశం
- వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్‌ఆర్‌సీపీకి పట్టం కట్టాలి
- ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి
- వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా





లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మేయర్, ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు ఇన్‌చార్జ్, కమిషనర్, కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు లబ్ధి చేకూరుతోందని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పేర్కొన్నారు. నాలుగున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో పేదల స్థితిగతులు మార్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరైన పేదలకు శనివారం వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేశారు. స్థానిక ఎగ్జిబిషన్ మైదానంలో హౌసింగ్, నగరపాలక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 33 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు అందించిందన్నారు. విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేసిందని, నాడు–నేడు ద్వారా స్కూళ్లు, ఆసుపత్రుల రూపురేఖలు మార్చిందని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజల చెంతకే వైద్యాన్ని తీసుకొచ్చామన్నారు. పెత్తందారులకు, ధనవంతులకు ఊడిగం చేసే టీడీపీని, ఆపార్టీ నాయకులను నమ్మొద్దన్నారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సుకు పాటుపడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలబడాలని, రానున్న ఎన్నికల్లో విద్యా వంతుడు, మాజీ కలెక్టర్ ఇంతియాజ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ పిల్లలకు కార్పొరేట్ విద్య, పేదలకు నాణ్యమైన వైద్యం, వృద్ధులకు పెన్షన్ ఇలా ఎన్నో అందిస్తున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీని ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యేగా తాను నగరంలోని 11 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా, మున్సిపాల్టీ, హౌసింగ్, రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పని లేకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. లక్షలు విలువ చేసే ఆస్తిని మహిళల పేరు మీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీలో కర్నూలు రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం విశేషమన్నారు. ఎన్నికలు దగ్గర పడటంతో అబద్ధాలు చెప్పేందుకు తెలుగుదేశం నాయకులు బయలుదేరారన్నారు. వాళ్లను నమ్మితే అన్నివిధాలుగా నష్టపోతారన్నారు. కర్నూలులో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుపొందిందని 2024లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా మాట్లాడుతూ ఇక్కడే పుట్టి పెరిగిన తనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారన్నారు. అందరికి అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా వలంటీర్లకు వందనం

కర్నూలు (టౌన్) : స్థానిక ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం సచివాలయ వలంటీర్లకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ హాజరై ప్రతిభ కనబరిచిన వినీష (బండిమెట్ట), సరస్వతీ (కాళికాంబ వీధి), షేక్ నూర్జహాన్ (బుధవారపేట), వెంకటేష్ (బుధవారపేట), ఖాజాహుస్సేన్ (జొహరాపురం), నాయకంటి నాగమణి (నేతాజీ నగర్), విజయరాజ్ కుమార్ (లక్ష్మీనగర్), మణెమ్మ (ధర్మపేట), శివరూపిణి (రోజా వీధి)లను శాలువ, మెడల్‌లతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు సచివాలయ వలంటీర్ల వారధులు అని అన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కన్వీనర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇంటి కల నెరవేరింది



మాది పేద కుటుంబం. సొంత ఇల్లు లేదు. నెలనెలా బాడుగలు కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంటి పట్టా రాలేదు. ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మాకు ఇంటి స్థలం మంజూరు చేయడమే కాక ఆ స్థలాన్ని ఉచితంగా నా పేరు మీద రిజిస్ట్రేషన్ ఇవ్వడం సంతోషంగా ఉంది. జగనన్న రుణం తీర్చుకోలేనిది. – పావని, లబ్ధిదారురాలు

విలువైన ఇంటి స్థలం ఇచ్చారు



నాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని నా పేరు మీదే రిజిస్టర్ చేసి ఇచ్చారు. రూ.4 లక్షలు విలువ చేస్తుంది స్థలం. మాలాంటి వారికి ఇంత పెద్ద సాయం ఎవరు చేస్తారు. ఇల్లు కూడా మంజూరైంది. కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా ఇంటి పట్టా ఇచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – పుల్లమ్మ, లబ్ధిదారురాలు

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (టౌన్): పోలింగ్ సమయంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవ్ తేజ ఆదేశించారు. శనివారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఎలక్టోరల్ ఆఫీసర్లు, సెక్టోరల్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారుల ద్వారా పోలింగ్ స్టేషన్ల వారీగా మ్యాపింగ్ చేయాలన్నారు. గత ఎన్నికల్లో సమస్యలు తలెత్తిన పోలింగ్ స్టేషన్లను పరిగణలోకి తీసుకొని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను గుర్తించండి

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను గుర్తించాలని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో పోస్టల్ బ్యాలెట్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోస్టల్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల హక్కుల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న డా. మహబూబ్‌బాషా

కర్నూలు(అర్బన్): ముస్లిం మైనారిటీల హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు కొనసాగిస్తామని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనారిటీల హక్కుల సాధన, వక్ఫ్‌బోర్డు భూముల రక్షణకు సంబంధించి గత నెల 11వ తేదీన కర్నూలు, 29వ తేదీన ఆదోనిలో నిర్వహించిన ముస్లిం మైనారిటీ గర్జనకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 10వ తేదీన నంద్యాలలో మహాగర్జనను నిర్వహిస్తున్నామన్నారు. నిరక్షరాస్యులైన ముస్లింలకు మంచి విషయాలను బోధించాల్సిన ఉల్మాలు రాజకీయ నేతల ఇళ్ల వద్ద పడిగాపులు కాయడం విచారించదగ్గ విషమన్నారు. అలాంటి వారిని భగవంతుడు కూడా క్షమించరన్నారు. ముస్లింల హక్కుల సాధనకు తెలంగాణలో కూడా ఉద్యమ బాటను కొనసాగిస్తామన్నారు. అలాగే ముస్లిం మైనారిటీ మహిళల కోసం ప్రత్యేకంగా సహారా ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సంస్థ ద్వారా నిరుపేదలైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, డ్వాక్రా సంఘాల ద్వారా ప్రతి ఒక్కరికి రూ.లక్ష వరకు రుణ సదుపాయం కలిప్తామన్నారు. ఎంఆర్‌పీఎఫ్ ప్రత్యేక యాప్, టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా, ఈ యాప్, టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 7వ తేదీన ఎంఆర్‌పీఎఫ్ యువజన విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో రిటైర్డు తహసీల్దార్ రోషన్‌అలీ, రిటైర్డు డీఎస్‌పీ మహబూబ్‌బాషా, సోయబుద్దీన్, ఎంఎం భాష, సయ్యద్‌షాముర్తుజా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీదే గెలుపు



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్) : కర్నూలు నగరంలో వరుసగా మూడవ సారి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టే గెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. 2014 సంవత్సరం నుంచి వరుసగా ఆ పార్టీ అభ్యర్థులే గెలుస్తున్నారని 2024 సంవత్సరంలో కూడా ఇదే పునరావృతం అవుతుందన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్వీ స్వగృహంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈయనను పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎస్వీ పరిచయం చేయించి మాట్లాడారు. కర్నూలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అడ్డా అని చెప్పారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు తాము ఇంతియాజ్ గెలుపు బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తామన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ 175 స్థానాల్లో ముఖ్యమంత్రి జగనన్ననే పోటీలో ఉన్నాడని భావించి కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఇంతియాజ్ మాట్లాడుతూ జగనన్న తనను కర్నూలు సమన్వయ కర్తగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు.

7న రసాయనిక విపత్తు మాక్ డ్రిల్

- కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు డీఆర్వో ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్ రావు

కర్నూలు (సెంట్రల్): కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అండ్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈనెల 7 న రసాయనిక విపత్తు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డీఆర్వో మధుసూదనరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీలో క్లోరిన్ వాయువు లీక్ అయితే తలెత్తే పరిణామాలను ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మాక్ డ్రిల్ నిర్వహించే ప్రదేశంలో వైద్య పరికరాలతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు, శ్వాస పరికరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. టీజీ ఆల్కలీస్ ఫ్యాక్టరీ సమీపంలో నివసించే కొంతమందిని అక్కడి నుంచి మాంటిస్సోరి ఒలింపియాడ్ స్కూల్‌లో ఏర్పాటు చేసే రిలీవ్ క్యాంప్‌కు తరలించాలన్నారు. సమావేశంలో కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, డీటీసీ శ్రీధర్, డీపీఓ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు తహసీల్దార్, డీటీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): తమ భూములను వేరే వాళ్లకు మ్యూటేషన్ చేసి బదిలీపై వెళ్లిన కోడుమూరు తహసీల్దార్ జయన్న, డీటీ రామాంజనేయులు, ప్యాలకుర్తి వీఆర్వో వెంకటరాముడులపై చర్యలు తీసుకోవాలని ప్యాలకుర్తికి చెందిన బాధిత రైతులు డిమాండ్ చేశారు. శనివారం ప్యాలకుర్తికి చెందిన చిన్నమాధవ స్వామి, గొల్లబుడ్డన్న, సుంకన్న, గురుప్రసాదు తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్యాలకుర్తి గ్రామంలోని సర్వే నంబర్లు 475,477,478లలో తమకు ఎకరం, అరెకరం పొలాలు ఉన్నాయన్నారు. అయితే రీసర్వే పేరుతో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఒక్కో రైతుకు సంబంధించి 20–30 సెంట్లను తీసి చింతకృష్ణమూర్తి అనే రైతుకు జనవరి 24 వ తేదీన మ్యూటేషన్ చేశారన్నారు. అదేరోజు తహసీల్దార్ బదిలీపై వెళ్లారన్నారు. రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకొని తమ భూములను చింత కృష్ణమూర్తి పేరిట మ్యూటేషన్ చేశారన్నారు.

ఈ రోజు

వైద్యుల ఉమెన్స్ డే వేడుకలు

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. మాధవీశ్యామల చెప్పారు. శనివారం ఐఎంఏ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రాజవిహార్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఎంఏ భవనంలో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సెక్రటరి డాక్టర్ విష్ణుప్రియ, ట్రెజరర్ డాక్టర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ ఈఈ చక్రపాణి తెలిపారు. ఎలక్ట్రికల్ లైన్‌లు, మెయిన్‌టెనెన్స్ పనులు జరుగుతున్నందున డీ2 సబ్ డివిజన్‌లోని ఓల్డ్‌టౌన్ సెక్షన్‌లోని ఓల్డ్‌టౌన్ పోలీసు స్టేషన్ ఏరియా, గీతామందిర్ ప్రాంతం,దండిగేరి, ఉస్మానియా కాలేజి రోడ్, ఎస్టేటు సెక్షన్ పరిధిలోని పోలీస్ కాలనీ ఏరియా, రామాలయం వీధి, బిర్లాగేట్, గాయత్రి ఎస్టేట్, 32వ వార్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పెద్దలకు వ్యాక్సినేషన్‌పై సదస్సు

కర్నూలు(హాస్పిటల్): పెద్దలకు వ్యాక్సినేషన్ అనే అంశంపై నేడు (ఆదివారం) ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు హెల్త్‌క్లబ్‌లో ప్రారంభమయ్యే కార్యక్రమంలో సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ జి. భవానీప్రసాద్ ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

సెక్యులర్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు

కర్నూలు(సెంట్రల్): సెక్యులర్ ఫోరం ఆధ్వర్యంలో లౌకిక తత్వాన్ని కాపాడుకుందాం–మతోన్మాదులను ఓడిద్దాం అనే అంశంపై నేడు (ఆదివారం) సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాతబస్టాండ్ ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాలులోఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు : కర్నూలు రోజా వీధికి చెందిన గరిక సాయికుమార్ (20) హత్య కేసులో నిందితులు సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన మల్లెపోగు మధు, షేక్ నిసార్ అహ్మద్, బుధవారపేటకు చెందిన గాజుల జగదీష్‌లను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. సాయికుమార్ తన తల్లిదండ్రులు చనిపోవడంతో తమ్ముడు కుమార్‌తో కలసి రోజా వీధిలో నివాసముంటూ ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. గత నెల 25వ తేదీ రాత్రి వరుసకు బావ అయిన గురుమూర్తితో కలిసి పరోటా తినేందుకు ఆటోలో కొట్ల సర్కిల్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో నిందితులు మరో ఆటోలో వారిని అనుసరిస్తూ హారన్లు గట్టిగా కొడుతూ చిర్రెత్తించడంతో ఆపి గొడవ పడి వెళ్లిపోయారు. చిదంబర రావు వీధిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్దకు ఇరువర్గాల వారు చేరుకుని మరోసారి గొడవ పడి సాయికుమార్‌ను కత్తితో గొంతు కోశారు. అడ్డుకునే యత్నం చేసిన గురుమూర్తి కూడా దాడిలో గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపే సాయికుమార్ మృతిచెందాడు. గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని పక్కా ఆధారాలతో శనివారం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వై.పవన్‌కుమార్ తెలిపారు.

పోలియోపై అవగాహన ర్యాలీ

కర్నూలు సిటీ: ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంయుక్తంగా పోలియో చుక్కలపై శనివారం ఆ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీహెచ్‌సీ డా.మంజూష, ఎంపీహెచ్‌ఈఓ మగ్బుల్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు. ఆదివారం రోజున 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కల వేయించాలని వైద్యులు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

హలో.. వినిపిస్తుందా ?



- బ్లూటూత్, హెడ్‌ఫోన్లతో వినికిడి సమస్య
- కొందరికి పుట్టుకతోనే లోపం
- ఆధునిక హియరింగ్ ఎయిడ్, శస్త్రచికిత్సలతో పరిష్కారం
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు
- నేడు ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినం

కర్నూలు(హాస్పిటల్):సరిగ్గా వినపడకపోతే మాట్లాడేందుకు సైతం మాటలు ఉండవు. ఇక పూర్తిగా వినపడకపోతే మాటలు కూడా మాట్లాడలేని పరిస్థితి. ఈ కారణంగానే వారు పెద్దగా ఎవ్వరినీ కలవరు. మాట్లాడేందుకు ఇష్టపడరు. ఎవ్వరినైనా కలిసినా, మాట్లాడినా ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని ఆందోళన చెందుతుంటారు. వినికిడి సమస్యపై అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం మార్చి 3న ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో పూర్తిగా వినికిడి శక్తి కోల్పోయిన వారు 35వేల మందికి పైగా ఉండగా, స్వల్పలక్షణాలతో వైద్యుల వద్దకు వెళ్లే వారు రెండున్నర లక్షల మందికి పైగా ఉండొచ్చని అంచనా. కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలో చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్యుల వద్దకు చెవిలో ఇబ్బందులతో రోజుకు సగటున 20 నుంచి 30 మంది వస్తుండగా అందులో వినికిడి సమస్యతో బాధపడే వారు 40 శాతానికి పైగా ఉంటున్నారు. వినికిడి సమస్యలు ఉన్న వారు శారీరక, మానసిక సమస్యలతో తీవ్ర వేదనకు గురవుతున్నారు. కొందరికి పుట్టుకతో సమస్య వస్తుండగా మరికొందరికి ప్రమాదాల్లో వినే గుణం కోల్పోతున్నారు.

వినికిడి సమస్య లక్షణాలు

- దూరంగా ఉండే శబ్దాలు, మాటలు సరిగా వినపడకపోవడం
- చిన్నగా మాట్లాడే శబ్దాలు సరిగా అర్థం కాకపోవడం
- గుంపులో ఉన్నప్పుడు, రేడియో, టీవీ చూసినప్పుడు మాటలు అర్థం కాకపోవడం
- కీచుగా మాట్లాడే స్త్రీల, పిల్లల గొంతులు వినపడకపోవడం

వినికిడి సమస్యకు కారణాలు

- ధ్వని ఎక్కువగా ఉండే పరిసరాల్లో ఉండటం
- మొబైల్, బ్లూటూత్, హెడ్‌ఫోన్‌లలో పెద్దశబ్దంతో మ్యూజిక్ వినడం
- వాహనాల శబ్దాలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో ఎక్కువసేపు ఉండటం
- జన్యుకారణాలు, పుట్టుకతో వచ్చే లోపాలు
- మేనరికం, వంశపారంపర్యంగా రావడం
- వృద్ధాప్యం, చెవి మధ్యలో ఇన్‌ఫెక్షన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెవిలో బడ్స్ గానీ, పిన్ను సూదులు గానీ పెట్టి తిప్పడం వల్ల చెవి శుభ్రపడదు. చెవిలో నొప్పికి నూనె, ఆకుపసర్లు వేయకూడదు. చెవిలో చీము కారుతుంటే స్విమ్మింగ్ చేయకూడదు. చెవిలో నీరు పోకుండా నూనె అంటిన దూదిని చెవిలో పెట్టుకోవాలి. ఎక్కువ శబ్దాలు వచ్చే ప్రదేశంలో పనిచేసేవారు ఇయర్ ప్లగ్స్ వాడాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వినికిడి పరీక్ష చేయించుకోవడం మంచిది. ఆరు నెలలు నిండిన చిన్నపిల్లలు శబ్దాలు చేసినప్పుడు తిరిగి చూడకపోతే బెరాటెస్ట్ చేయించుకోవాలి.

ఆధునిక టెక్నాలజీతో వినికిడి మిషన్లు

చాలా మంది వినికిడి మిషన్లు వాడాలంటే మొహమాటం, సిగ్గు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం కంప్యూటరైజ్డ్ వినికిడి మిషన్లు చెవిలోపల, చెవి వెనుక కనిపించకుండా అమరుస్తారు. ఇవి వాడటం ద్వారా మనకు ఎంత వినికిడి శక్తి కావాలో అంతే తీసుకుంటుంది. పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న పిల్లలైతే వెంటనే వినికిడి మిషన్లు అమర్చుకుని స్పీచ్‌థెరపీ తీసుకుంటే ఆ పిల్లలకు త్వరగా డెవలప్‌మెంట్ బాగుంటుంది. వినికిడి మిషన్ వాడటం వల్ల చిన్నశబ్దాలు, మాటలు మొదలుకొని దూరం నుంచి వచ్చే శబ్దాలు, మాటలు చక్కగా వినగలరు. ఉన్న వినికిడి లోపం పెరగకుండా కాపాడుకోగలరు. చెవిలో నుంచి శబ్దం తగ్గుతుంది.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు

పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న వారికి డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీ చేయిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రైవేటులో అయితే ఈ ఆపరేషన్ రూ.8 లక్షల నుంచి రూ.10లక్షల దాకా ఖర్చు అవుతుంది. అలాగే చెవిలో రంధ్రం పడిన వారికి మైరింగోప్లాస్టీ అనే ఆపరేషన్ సైతం ఆరోగ్యశ్రీలోనే చేస్తారు.

మందులు, శస్త్రచికిత్సతో పరిష్కారం



చిన్నపిల్లల్లో దగ్గు, జలుబు వచ్చినప్పుడు చెవి బ్లాక్ అవుతుంది. దానివల్ల కొన్నిసార్లు వినికిడి సమస్య రావచ్చు. కాబట్టి దగ్గు, జలుబు వచ్చిన వెంటనే చికిత్స చేయించాలి. పుట్టిన పిల్లలకు సైతం సత్వరమే వినికిడి సమస్యను గుర్తించాలి. చెవిలో రంధ్రం పడితే మైరింగోప్లాస్టీ ఆపరేషన్ చేస్తాం. పెద్దల్లో నరాల బలహీనత వల్ల వినికిడి సమస్య వస్తుంది. వీరికి ఆడియోమెట్రీ పరీక్ష చేసి మందులు వాడాల్సి ఉంటుంది. తగ్గకపోతే హియరింగ్ ఎయిడ్ వాడాల్సి వస్తుంది.

–డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, ఈఎన్‌టీ వైద్యులు, కర్నూలు

చెవి బయట కనిపించని మిషన్లూ వచ్చాయి



వినికిడి సమస్య ఉన్న వారిలో చాలా మంది మిషన్ అమర్చుకోవాలంటే జంకుతున్నారు. దానిని చెవి బయట కనిపించేటట్లు పెట్టుకుంటే తమ వైకల్యం బయటపడుతుందని వారి భయం. అలాంటి భయం లేకుండా అత్యాధునిక టెక్నాలజీతో చెవిలోపల కూడా అమర్చే మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక వ్యక్తి అవసరమైన చికిత్సను పొందకపోతే, వినికిడి మిషన్‌ను ఉపయోగించకపోతే సెల్‌ఫోన్ రేడియేషన్, శబ్దకాలుష్యానికి గురికావడం కొనసాగితే వారి వినికిడి సామర్థ్యం క్షీణిస్తుంది. కొన్ని సంవత్సరాల తర్వాత పూర్తిగా వినికిడి శక్తి కోల్పోతారు.

–రోజా బంగి, ఆడియాలజిస్టు, కర్నూలు